
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
సోమవారం 8 సెప్టెంబర్ 2025 - పేజీలు 8







# దోమలు బాబోయ్. దోమలు..!!




**గుంటూరు పల్నాడు జిల్లాల**
**నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో, పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి.. ఇటీవల వర్షాలు కురవడంతో దోమల వృద్ధి వేగంగా జరు గుతోంది.. గుంపులు గుంపులుగా పుట్టుకొస్తున్న దోమలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.. సాయంత్రమైతే చాలు.. చెరువులు, కాలువలు, ఓపెన్ ప్లేస్ లు, పక్కనున్న కాలనీల్లో ప్రజలు తలుపులు తెరవాలంటేనే భయపడిపోతున్నారు.. వీధుల్లో డ్రైనేజీలను రోజుల తరబడి శుభ్రపరచకపోవడం, మురికి నీటిపై దోమలు వేగంగా వృద్ధి చెందుతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యాన్ని ధృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు.. దోమల నియంత్రణ చర్యలను మొక్కుబడిగా చేపడుతూ మిగతా 3వ పేజీలో

- మంచం పట్టిన ఉమ్మడి గుంటూరు జిల్లా..
- సాయంత్రం వేళల్లో కుప్పలుగా ఇళ్లల్లోకి
- వర్షాల కారణంగా వేగంగా వృద్ధి
- నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం
- డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్న వైనం
- కార్పొరేషన్, మున్సిపాలిటీల తీరుపై ప్రజల అసహనం



## "స్త్రీ శక్తి" సభకు సర్వం సిద్ధం

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడి**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నేడు సెప్టెంబర్ 8 (సోమవారం) సాయంత్రం 5 గంటలకు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో "సూపర్ సిక్స్ - సూపర్ హిట్ - స్త్రీ శక్తి" సభను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి సాయంత్రం 4 గంటలకు భారీ ర్యాలీగా కార్యకర్తలు, అభిమానులు, మహిళా శక్తి ఊరేగింపుగా సభా ప్రాంగణానికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం పసుపు, జనసేన, కాషాయ పతాకాలతో అలరారనుంది. రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రముఖ ప్రజాప్రతినిధులు సభలో పాల్గొననున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మహిళా సాధికారత గురించి ఈ సభలో నేతలు ప్రసంగించనున్నారు. ఈ సభను ఘనవిజయం చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదివారం పిలుపునిచ్చారు.

## మెడికల్ కాలేజీలపై తప్పుడు ప్రచారం



**ఐదేళ్లలో కాలేజీల ప్రారంభమేగానీ చిత్తశుద్ధి లేదు**
**పీపీపీ విధానంలో అత్యంత వేగంగా కాలేజీల నిర్మాణం**
**మనస్ఫూర్తిగా స్వాగతిస్తోన్న ప్రజానీకం**
**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

గుంటూరు, మేజర్ న్యూస్ : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ ప్రజలను తప్పుదారి పట్టించేలా దుష్ప్రచారానికి పూనుకుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో రూ.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మెడికల్ కాలేజీల అంశంపై మాట్లాడారు. రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. ఈ కాలేజీలను 2027-28లోగా పూర్తి చేయడం ద్వారా ఒక్కో కాలేజీలో 150 మెడికల్ సీట్లు పెరుగుతాయని చెప్పారు. కాలేజీల నిర్మాణం పూర్తయ్యాక వాటి నిర్వహణ, యాజమాన్య హక్కులు పూర్తిగా ప్రభుత్వం వద్దే ఉంటాయని, తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నిర్మించిన కాలేజీల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవని, 59 శాతం మేర ప్రొఫెసర్ల కొరత ఉందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయా కాలేజీల్లో అన్ని సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలేజీల నిర్మాణం త్వరగా పూర్తయితే మన ప్రాంత విద్యార్థులు వేరే రాష్ట్రాలకు వెళ్ళిన అవసరం ఉండదని చెప్పారు. ఇక్కడే వైద్యులను తయారు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో కూటమి మిగతా 3వ పేజీలో

## కోలాహలంగా అర్బన్ బ్యాంకు నామినేషన్లు



**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల అభ్యర్థులు ఊరేగింపుగా భారీ ర్యాలీతో నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికపై గత కొద్దికాలంగా ఉత్కంఠత నెల కొంది. ఎట్టకేలకు ఎన్నిక ఏకగ్రీవంగా మారింది. టీడీపీ నాయకులు మంగమూరి హరి ప్రసాదరావు ఛైర్మన్‌గా, డైరెక్టర్లుగా షేక్ జిలానీ, కనగాల శ్రీనివాసరావు, తోట చంద్ర శేఖర్, గడ్డిపాటి నాగయ్య, బచ్చు శ్రీనివాసరావు, తోట పున్నారావు, కన్నెగంటి శ్రీనివా సరావు, కందేపి శ్రీనివాసరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, దొప్పలపూడి శ్యాంసన్, గండపనేని పూర్ణచంద్రరావు లు నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల అధికారి కర్రా వెంకటేశ్వరరావు కు నామినేషన్ పత్రాలు అందించారు. తొలుత పట్టణంలో భారీ ఊరే గింపు మధ్య అయా పార్టీల నాయకులు నామినేషన్‌కు వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, గుమ్మడి రమేష్, సుంకర హరికృష్ణ, వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, చుక్కపల్లి పెదబాబు, ధరణి, కౌన్సిలర్లు దివి అనిత, బోయపాటి అరుణ, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పలువురు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో ఆరోపణలు అవాస్తవం



**వినుకొండ మేటర్ న్యూస్ :** ఈ రోజు కొన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లో "కారుమంచి గ్రామంలోని ఒక వర్గం వారిపై పోలీసులు అక్రమంగా కేసు పెట్టి అరెస్ట్ చేశారు" అని ప్రచారం చేయుచున్నారు. కారుమంచి గ్రామంలో 04.09.2025వ తేదీ ఒక వర్గం వారు గణేష్ నిమజ్జనం చేసుకుంటూ ఎన్టీఆర్ సెంటర్ మరి యు సత్రం సెంటర్ వస్తారు. ఆ టైంలో రెండు వర్గాల వారు ఒకరి పై ఒకరు దాడి చేసుకుంటారు. ఆ దాడిలో కొందరికి గాయాలు అవుతాయి. దానిమీద ఇరువర్గాలు పై కేసులు రిజిస్టర్ చేయడం జరిగింది. దర్యాప్తు లొ భాగంగా కొంత మంది ముద్దాయిలను ఈరోజు అరెస్ట్ పెట్టడం జరిగింది. పోలీసులు ఎవరు కూడా చట్టాన్ని అతిక్రమించి అక్రమ కేసులు పెట్టలేదు. రెండు వర్గాలు గొడవ పడి, కొట్టుకున్న వారి మీద కేసులు పెట్టాము. పోలీసులు ఎవరిని ఇబ్బంది పెట్టలేదు . మేము చట్ట ప్రకారమే నడుస్తున్నాము. ఇలాగ సోషల్ మీడియాలో ఆరోపిస్తున్నట్టు అటువంటిది ఏమీ జరగలేదు. మేము చట్టం ప్రకారం ముందుకు పోవడం జరుగుతుంది.

## విశ్వకర్మ జయంతిని అధికారకంగా నిర్వహించాలి




**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** సృష్టికర్త భగవాన్ విశ్వకర్మ జయంతి ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లు అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినందున ఈనెల 17 న విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ కి విజ్ఞప్తి చేయటం జరిగిందని నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు చింతాడ రమేష్ తెలిపారు. సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ ఆదేశాలు మేరకు పట్టణంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను కలుపుకొని కార్యక్రమం నిర్వహించే విధంగా చూడాలని ఎమ్మెల్యే సూచించారన్నారు. సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ని కలిసి సెప్టెంబరు 17 నా విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికార కార్యక్రమంగా నిర్వహించాలని కోరటం జరిగింది. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కోటగిరి పోతులూరయ్య, వానపాముల నాగరత్నమా చార్యులు, దాసు భాస్కరా చారి, వంగిపురపు సుర్య నారాయణ, తిప్పర్తి శంకర్ బాబు, అత్తలూరి కోటేశ్వరరావు, బిజేపి నాయకులు శంకర రావు, శంకర్ పాల్గొన్నారు.

## దర్శకుడు బోయపాటి దృష్టికి పరమ వీరచక్ర పోతురాజు యదార్థ జీవితం

- 1965 లో పాకిస్తాన్ యుద్ధ విమానాలను
- కూల్చివేసిన తెనాలి సైనికుడి యదార్థ జీవితం







**తెనాలి, సెప్టెంబర్ 7 :** భరత్ పాక్ ల మధ్య 1965లో జరుగుతున్న యుద్ధంలో తెనాలి కి చెందిన సైనికుడు హవల్దార్ పోతురాజు భారత్ భూమిలోని కాశ్మీర్ తావి వంతెన లోకి ప్రవేశించిన రెండు సైబర్ జెట్ విమానాలను కొండపైనుండి గురితప్పకుండా తుపాకితో పేల్చేసి నేలకూల్చారు. శత్రు దుర్భేర్యమైన పాక్ విమానాలు చొరబడితే ఎందరో భార తీయుల ప్రాణ నష్టం జరగకుండా రక్షించిన భరతమాత వీరపుత్రుడు హవల్దార్ పోతురాజును నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ అత్యంత ప్రతిష్టాత్మకమైన పరమవీరచక్ర పురస్కారంతో గౌరవించారు. అనంతరం నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రత్యేకంగా పోతురాజును పిలిపించుకుని సత్కరించారు. 1958 లో భారత్ సైనికుడిగా ఎంపికయిన పోతురాజు " యాంటి ఎయిర్‌క్రాఫ్ట్ గన్" శిక్ష తీసుకుని ఆకాశంలో మూడువేల అడుగుల్లో 1300 కిలోమీటర్ల వేగంతో భారత భూభాగాన్ని నాశనం చేయడానికే వస్తున్న పాక్ సైబర్ జెట్ రెండు విమానాలను నేలకూల్చడం భీష్ముడు దగ్గర శిక్షణ తీసుకున్నా గురితప్పకుండా లక్షాన్నీ అధిగమించడం చాల కష్టం. కానీ చేసిచూపించి భారతీయ పౌరుల ప్రాణాలకు తన ప్రాణం అడ్డు పెట్టి రక్షించిన నిజమైన దేశరక్షకుడు పరమవీరచక్ర పోతురాజు. ఇలాంటి దేశభక్తులు ఎందరో భారత్‌లో ఉన్నారు. పోతురాజు యాదార్థ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సినిమా తీయవలసిందిగా సత్తా గలిగిన ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను దృష్టికి తెనాలికి చెందిన 'మా – ఏపి' వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్ రాజ యదార్థ జీవిత కథను తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన బోయపాటి 'దిలీప్ రాజా' కు ఫోన్ ఛేసి మాట్లాడుతానని మెసేజ్ పంపినట్లు సమాచారం. ఇలాంటి సైనికులే పాల కులైతె ప్రజాస్వామ్యం కోరియోగ్రాఫర్ సాయం లేకుండానే ఆనందంతో ఎన్ని కేరింతలు వేస్తుందో? అవినీతిరహిత దేశంగా ఎంతగా సంబరపడుతుందో? సైనికుల రక్షణలో జాతీయ జెండా పౌరుషంతో ఎలా ప్రయాణిస్తుందో ? అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలోని ప్రజలు చూడాలంటే ఏం ఛేయాలో ఆలోచించాలానే ఉద్దేశ్యంతో ప్రముఖ దర్శకులు, మానసిక సంఘర్షణ గల లెజండరీ దర్శకుడు బోయపాటి శ్రీను దృష్టికి తీసుకెల్లినట్లుగా దిలీప్ రాజా ఆదివారం తెనాలిలో మీడియాకు తెలిపారు. అంతెగాని ఏఒక్కరినీ విమర్శించడానికీకాదని ఆయన స్పష్టం చేశారు. చూద్దాం 'చిత్రాలెన్ని జరుగుతాయో.

## నరసరావుపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

**నరసరావుపేట మేజర్ న్యూస్:** ఆదివారం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కే జి ఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ మరియు నార్ల ఫౌండేషన్ నరసరావుపేటలోని స్థానిక గుంటూరు రోడ్‌లో గల మూడో వార్డు సచివాలయం వద్ద ఊపిరితిత్తులు శ్వాసకోశా వ్యాధుల నిపుణులు డాక్టర్ కొల్లి కృష్ణ చైతన్య ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగినది ఈ యొక్క వైద్య శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు చేయటం జరిగింది. వారు వచ్చి డాక్టర్ ని సంప్రదించి తగిన ఉచిత వైద్య పరీక్షలు చేయించుకొని సలహాలు సూచనలు తీసుకోవడం జరిగినది ఈ యొక్క వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు హాజరైనారుఈ కార్యక్రమా నిర్వాహకులు నార్ల మారుతి బాబు ఏటీఎం మంజూరు మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య నరసరావుపేట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణ నరసరావుపేట మండలం దేశం పార్టీ అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాస రావు నరసరావుపేట నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బసవేశ్వర రావు ప్రధాన కార్యదర్శి వేముల బాలు నరసరావుపేట అధ్యక్షులు నరసింహారావు పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు మడక ప్రసాద్ తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి అల్లం శెట్టి మోహన్రావు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా



అధికార ప్రతినిధి కనుమూరి లక్ష్మి రొంపిచర్ల మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గాడిపర్తి సురేష్ షాది ఖానా చైర్మన్ రెహమాన్ క్లస్టర్ ఇంచార్జ్ వాసిరెడ్డి రవీంద్ర సంఘం డైరీ డైరెక్టర్ మక్కెన ఆంజనేయులు మూడో వార్డు ప్రెసిడెంట్ సయ్యద్ భాష సెక్రెటరీ అర్జున్ నరసరావుపేట మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే సుభాని లింగంగుంట సొసైటీ వైస్ చైర్మన్ భాష పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు మస్తాన్ బి ఐ టీడీపీ అధ్యక్షులు మస్తాన్వలి జంగాల వెంకటేశ్వర్లు బుజ్జి తెలుగు యువత అధికార ప్రతినిధి కత్తి రఫీ మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వంకాయలపాటి రవి జానీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ మాబు గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ మెంబర్ హనుమత్ ప్రసాద్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు బడే బాబు మహాశక్తి టీం అధ్యక్షులు వెంకట్రావు ప్రెసిడెంట్ సల్మాన్ మూడో వార్డు బూతు కన్వీనర్ దమ్మాటి శీను గద్దె లక్ష్మి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా నరసరావుపేట రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంగారం రాయప్ప ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్లుగా RTC బస్ సౌకర్యం లేని గ్రామాలకు త్వరలో బస్



**వినుకొండ మేజర్ న్యూస్ :** గత 30 ఏళ్లుగా బస్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న దాట్లవారిపాలెం,హరిజన కాలనీ, కమ్మవారిపాలెం గ్రామ ప్రజలకు శుభవార్త అనే చెప్పాలి. ముఖ్యంగా హైస్కూల్‌కి వెళ్ళే విద్యార్థులు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామానికి సుమారు 5గ్రామాలు (త్రిపురపురం, గొల్లపాలెం, తలార్లపల్లి, దాట్లవారిపాలెం,కమ్మవారిపాలెం) కు చెందిన పిల్లలు ప్రమాదకరంగా ఆటోల్లో వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఈ రూట్లో నూజెండ్ల లో వెళ్లే బస్సు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆళ్ల గురువారెడ్డి మరియు గ్రామస్తులు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు కలిసి బస్సు కోసం వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ వారికి బస్సు ఏర్పాటుకు కావలసిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు అందులో భాగంగా ఆర్టీసీ అధికారులు ఆదివారం మండలంలోని ఐదు గ్రామాలను రూట్ సర్వే నిర్వహించారు. ఈ బస్సు ఏర్పాటు వలన వందల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు మరియు గ్రామ ప్రజలకు వినుకొండకు మరియు నూజెండ్ల వెళ్లే దానికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని ప్రజల ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే సాధ్యమైనంత తొందరగా తమ ఊరికి బస్సు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా వినుకొండ ఆర్టీసీ సూపర్డెంటి ధనలక్ష్మి మాట్లాడుతూ రూటు వెరిఫికేషన్ లో భాగంగా ఈరోజు బస్సు తో వెరిఫికేషన్ చేసామని,, గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించి, ప్రయాణికుల సంఖ్య, రహదారి పరిస్థితులను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా రిపోర్టు రాసి పంపించి బస్సు ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలియజేశారు. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ పిల్లలకు స్కూలుకు వెళ్ళొచ్చేందుకు రాకపోకలు సులభం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. "30 ఏళ్ల తర్వాత గ్రామానికి మళ్లీ తిరిగి బస్సు నడుస్తుందంటే సంతోషంగా ఉందని" స్థానికులు ఎమ్మెల్యే ఆంజనేయులు కృషికి కృతజ్ఞతలు తెలిపారు.

# చదువును ఆయుధంగా మార్చుకోవాలి : కమిషనర్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** పేద విద్యార్థులు చదువును ఆయుధంగా మార్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్( ఎన్. ఎం. ఎం. ఎస్) ఉచిత శిక్షణ శిబిరాన్ని గుంటూరులోని భాష్యం ఆడిటోరియంలో పులి శ్రీనివాసులు ప్రారంభించి ప్రసంగించారు. మానవత కార్యదర్శి కె. సతీష్ నేతృత్వంలో జరిగిన శిక్షణ శిబిర కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి 8వ తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, శిక్షకులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పులి శ్రీనివాసులు ప్రసంగిస్తూ విద్యార్థులు గమ్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో అడుగులు వేస్తే గమ్య స్థానాన్ని చేరుకోగలరని తెలిపారు. పేద విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో విద్యను అభ్యసిస్తుంటే పేదరికం అడ్డు కాబోదని, మానవత లాంటి సంస్థలు ప్రతిభగల విద్యార్థులను ఆదుకుంటాయని తెలిపారు. మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ద్వారా సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్ షిప్ లను అందిస్తుందని, తద్వారా ప్రతిభగల విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటుతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. పోటీ పరీక్షలకు పునాది ఏర్పడడానికి ఎన్ఎంఎంఎస్ తోడ్పడుతుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఎన్ఎంఎంఎస్ ద్వారా మధ్యలో బడి మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయూతనిస్తూ మనోధైర్యాన్ని నింపుతుందని అన్నారు. అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో 34వ స్థానంలో ఉందని, దీనిని అధిగమించడానికి రాజకీయాలకు అతీతంగా ఐక్య కృషి జరగాలన్నారు. మానవత కార్యదర్శి కె. సతీష్ ప్రసంగిస్తూ గత ఏడాది నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ కార్యక్రమం ద్వారా 80 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. ఎన్ఎంఎంఎస్ 2025లో 160 మంది ఎంపిక అయ్యేటట్టు కృషి చేస్తామన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ విజిఎస్ పబ్లికేషన్స్ అధినేత ఎస్. రామారావు లక్ష రూపాయల విలువ చేసే ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ తో కూడిన 300 పుస్తకాలను ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. అమెరికాలో ఉన్న ప్రవాసా%శీ%ధ్రులు ప్రభాకర్ రావు లక్ష రూపాయలు శిక్షణ కార్యక్రమ నిర్వహణ కోసం అందజేయడం, భాష్యం సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ ఆడిటోరియం ను 13 ఆదివారాలపాటు ఎన్ఎంఎంఎస్ శిక్షణ కోసం ఉచితంగా ఇవ్వడాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్ ద్వారా స్కాలర్ షిప్ పొందిన విద్యార్థులను అభినందించారు. విజిఎస్ పబ్లికేషన్స్ ప్రచురించిన ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ తో కూడిన పుస్తకాలను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నేతలు టి. ధనుంజయ రెడ్డి, ఉప్పల సాంబశివరావు, పి. విమల కుమారి, టీవీ సాయిరాం, చావా శివాజీ, మేకల రామారావు, చావా లక్ష్మీ సామ్రాజ్యం, కె. పావని తదితరులు ప్రసంగించారు.

# ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతం : రెవెన్యూ అధికారి ఖాజావలి

**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆదివారం గుంటూరులోని వివిధ పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్కె.ఖాజావలి పరిశీలించారు. ఉదయం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఏసి కళాశాల, టీజేపీఎస్ కాలేజీ, విజ్ఞాన్ నిరూల డిగ్రీ అండ్ పీజీ కాలేజిలోని పరీక్షా కేంద్రాల్లో జరిగిన స్క్రీనింగ్ పరీక్షలను డిఆర్ఓ పరిశీలించారు. ఉదయం పరీక్షలకు 7,655 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 5,988 మంది అభ్యర్థులు హాజరవగా, 1,667 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు మొత్తంగా 78.2శాతం నమోదైనట్లు తెలిపారు. మధ్యాహ్నం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షకు 1,492 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1,133 మంది అభ్యర్థులు హాజరైనారు.



359 మంది గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లైజను అధికారులు , ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# విశ్వనాథ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలి

**గుంటూరు, మేజర్ న్యూస్**

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యం యువ సాహితీవేత్తలకు ఒక దిక్సూచి, ప్రేరణ కావాలని వివిఐటి విద్యాసంస్థల ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. వివిఐటి విశ్వవిద్యాలయం, విశ్వనాథ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురం, శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో 'విశ్వనాథ పదంలో యువత దృక్పథం పత్ర సమర్పణ సదస్సు' నిర్వహించారు. ప్రారంభ సదస్సుకు డాక్టర్ మద్దినేని సింహకౌటిల్యచౌదరి అధ్యక్షత వహించి, ఆధునిక తెలుగు సాహిత్యం పునర్జీవానికి కవిసామ్రాట్



సత్యనారాయణ తనదైన శైలిలో బాటలు వేశారన్నారు. అతిథులుగా కవి సామ్రాట్ మనుమడు విశ్వనాథ సత్యనారాయణ, విశ్వనాథ సాహిత్య అకాడమీ సభ్యులు పిన్నమనేని మృత్యుంజయరావు పాల్గొన్నారు. చారిత్రక నవలల సదస్సుకు డాక్టర్ అబ్బరాజు మైధిలి అధ్యక్షత వహించగా కడిమి చెట్టు నవలపై చీదెళ్ళ వీహెచ్ సూర్యకిరణ్, వీర పూజ నవలపై మాడుగుల ఎన్.వి. సుబ్రహ్మణ్య శర్మ, చందవోలు రాణి నవలపై పాతూరి శ్రీప్రవణ్ చర్చించారు. సాంఘిక నవలల సదస్సుకు కళ్యాణ్ అధ్యక్షత వహించగా విఎన్ఎస్ హరిప్రియ, పరీక్ష నవలపై కురుగంటి చిరంజీవి కార్తీక్, కుణాలుని శాపము నవలపై కనకాల రవికుమార్ విశ్లేషించారు. అనంతరం వాసిరెడ్డి విద్యాసాగర్ 'విశ్వనాథ పథంలో యువత' గ్రంధావిష్కరణ చేశారు. కార్యక్రమంలో రావెల సాంబశివ రావు, మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రమోహన్, సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

## సుమేధ ఉపాధ్యాయులకు అవార్డులు

**గుంటూరు, మేజర్ న్యూస్ :** స్థానిక ఎన్జిజిఒ కాలనీలోని సుమేధ హై స్కూల్ ఉపాధ్యా యులు కంతేరులోని విశ్వ శాంతి స్కూల్లో అప్పుసం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్య ంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్స వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవా ర్డులు అందుకున్నట్లు హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. హైయర్ ఎడ్యుకేషన్ నుంచి కె.అరుణ్‌కుమార్, ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో కృష్ణవేణి టీచర్ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. స్కూల్‌డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు బెస్ట్‌టీచర్ అవార్డులు రావటం అభినందనీయం అన్నారు.



## దోమలు బాబోయ్.. దోమలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు.. ఈ పరిస్థితి గ్రామ పంచాయతీలతో పోల్చితే మున్సిపాలిటీలలో మరింత అధ్వానంగా తయారైంది..

**చాలాచోట్ల జాడలేని ఫాగింగ్..**

వర్షాకాలం ప్రారంభమై సుమారు రెండు నెలలు కా వస్తున్నా ఇప్పటి వరకు వీధుల్లో ఫాగింగ్ చేపట్టకపోవ డమే అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. వర్షాకాలం ప్రారంభమైందంటే గతంలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తేడా లేకుండా విరివిరిగా దోమల నివారణ చర్యలు చేపట్టేవారు. మున్సిపాలిటీల్లో అనేక రకాల పేర్లతో అధికారులు, పాలకులు పారిశుధ్య పనులు చేపట్టేవారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి కూడళ్లు, టైర్ల కొట్లు, డ్రైనేజీల్లో నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టేవారు. కొబ్బరి బోండాల్లోనూ నీరు నిలువ ఉండకుండా వాటిని జనావాసాల నుంచి దూరంగా తరలించేవారు. ఇళ్లు, పరిసరాలతో పాటు నిర్మాణంలోని నీటి ట్యాంకులు, వ్యర్థాలు, పాత సామగ్రిని తనిఖీ చేసేవారు. నీటి నిల్వలు తొలగించి, దోమల మందు పిచికారీ చేసేవారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో సహజంగానే బయటి వాతావరణంలో పలు రకాలుగా నీటి నిల్వలు పెరిగాయి. ముఖ్యంగా వినియోగంలో లేని భవనాలు, ఖాళీ ప్రదేశాలు, నిర్మాణంలో ఉన్న కట్టడాల వద్ద దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నివారణలో ఫాగింగ్ ప్రధానం. మున్సిపాలిటీల పరిధిలో ఫాగింగ్ యంత్రాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నప్పటికీ వాటి సేవలను ఇంతవరకు వినియోగించిన దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా రికార్డుల్లో మాత్రం ఎప్పటికప్పుడు దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు నమోదు చేస్తుండటం కొసమెరుపు.

**క్లోరినేషన్ ఏదీ...?**

ప్రజలు తాగే రక్షిత మంచినీటి ట్యాంకుల్లోనూ క్లోరినేషన్ చేసిన దాఖలాలు కానరావడం లేదు. నిలువ నీరు ఉన్నచోట లార్వా వృద్ధి చెందే అవకాశాలు అనేకం ఉంటాయి. క్లోరినేషన్ చేయడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అలాగే వీధుల్లోని నాలాల్లో సైతం బ్లీచింగ్ చేసిన పాపాన పోవడం లేదు. నీరు నిలువ ఉండే చోట్ల బ్లీచింగ్ చేస్తే ఆదిలోనే లార్వా అంతమై దోమల బెడద తగ్గుతుంది. ఆ చర్యలు కూడా మున్సిపాలిటీల్లో చేపట్టడం లేదు. దీంతో సాయంత్రం వేళ్లలో లైట్లు వేయగానే నాలాల్లో ఉన్న దోమలన్నీ ఇళ్లలోకి చేరుతున్నాయి. గుంపులు గుంపులు గా వస్తున్న దోమల కారణంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..**

పరిసరాలు పరిశుభ్రంగా లేని కారణంగా వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా లాంటి విష జ్వరాలు సోకుతున్నాయి. ముఖ్యంగా పగలు కుట్టే దోమల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఉంది. అవి కుడితే డెంగ్యూ, చికన్ గున్యా వంటి తీవ్రమైన జ్వరాలు సోకుతాయి. వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఆస్పత్రులలో జ్వరపీడితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతానికి వైరల్ జ్వరాలతో ప్రజలు బాధ పడుతున్నప్పటికీ దోమల కారణంగా విషజ్వరాలు సోకుతున్నాయి. తాగునీరు సరఫరా చేసే ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయని కారణంగా నీరు కలుషితమై అతిసార ప్రభలే ప్రమాదం కూడా పొంచి ఉంది. అధికారుల వైఖరిపట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఉమ్మడి గుంటూరు జిల్లాలో డెంగ్యూ పాజిటివ్..**

విపరీతంగా పెరిగిన దోమల కారణంగా ప్రజలు ఆనారోగ్యాల భారిన పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేల మంది జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు. పగలు కుట్టిన దోమల కారణంగా కొందరికి డెంగ్యూ భారిన పడ్డారని సమాచారం. వారిలో కొందరు ప్రైవేట్, ప్రభుత్వ చికిత్స పొందుతున్నప్పటికీ డెంగ్యూ బాధితుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వందల సంఖ్యలో మలేరియా భారిన పడ్డారని తెలిసింది.

**పల్లెలే నయం..**

పారిశుధ్య చర్యలు మున్సిపాలిటీలతో పోలిస్తే పల్లెల్లోనే కాస్త మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పంచాయతీల్లో ఫాగింగ్, క్లోరినేషన్, బ్లీచింగ్ తదితర పనులు చేపడుతున్నారు. వీధుల్లో మొలిచిన పిచ్చిగడ్డిని తొలగించడం, డ్రైనేజీలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయడం వంటి పనులు చేపడుతున్నారు. డ్రైనేజీల్లో లార్వా వృద్ధి చెందకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయిల్ బాల్స్ నీటిలో వేయగానే చమురు విస్తరించి, ఆ పరిసరాల్లో దోమల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. తద్వారా గ్రామాల్లో దోమల నివారణకు దోహదపడుతోంది. అయితే ఆ ప్రక్రియంతా కేవలం గ్రామాలకే పరిమితం కావడం గమనార్హం. గ్రామాల్లో చేపడుతున్న దోమల నివారణ చర్యలేవీ ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అమలు కావడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని పురప్రజలు కోరుతున్నారు.

## మెడికల్ కాలేజీలపై తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య శాఖలో మూడు వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుందని, రూ.4500 కోట్లతో ఆస్పత్రుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదలకు వైద్యానికి భరోసా కల్పిస్తోందని, ఇది కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని స్పష్టం చేశారు.

# పోస్టుమాన్ బులెబ్బాయ్‌కు ఘన సన్మానం

**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండలం గ్రామంలో అన్నపూర్ణ కళ్యాణ మండపంలో ఈ రోజు 37 సంరాలు పోస్ట్ మ్యాన్ గా పనిచేసిన వరగాని గ్రామస్తులు నూతలపాటి వెంకటేశ్వర్లు(బులెబ్బాయ్) సతీమణి ఉమాదేవిలకు నాటి మేటి మరియు తోటి ఉద్యోగులు వారిని ఘనంగా సన్మానించారు, ఆదివారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో తోటి యూనియన్ నాయకులు మాట్లాడుతూ బులెబ్బాయ్ ఉద్యోగం విషయంలో నీతి నిజాయితీతో అంకిత భావంతో పని చేసారని, అందరికి తలలో నాలిక లాగా మేదులుతూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని అయన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో వచ్చి అభినందనలు తెలుపుతూ దు సశ్శలువాలరో సత్కరిస్తూ బట్టలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో అలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, పి 3, పి 4, ఈడి అషోషియేషన్ సభ్యులు ఏం రామకృష్ణ, రాము, ఏం శ్రీనివాసరావు, వి మోహనరావు, పి బాలకుటుంబరావు, నిమ్మగడ్డ నాగేశ్వరరావు,డెప్యూటీ తహసీల్దార్ ఎస్ k కరీముల్లా, పారిశ్రామిక వేత్తలు ఆరవపల్లి కృష్ణమూర్తి, దాసరి శేషగిరిరావు, పి ఏ ఎస్ కళాశాల




ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య, పిజికల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు, నర్రా వీరయ్య, నర్రా బాలకృష్ణ, దివ్వి నాగయ్య, కాకుమాను బుర్రయ్య, పెద్ది గోపాలకృష్ణ, పెదనందిపాడు పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పెదనందిపాడు, వరగాని గ్రామస్తులు, బులెబ్బాయ్ శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

**– అందుబాటులోకి రానున్న 1,000 పడకలు**
**– గుంటూరు జిజిహెచ్ లో 500, కాకినాడ జిజిహెచ్ లో 500**
**– రూ. 128 కోట్ల వ్యయంతో రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు**
**– రు. 51 కోట్లతో వైద్య పరికరాల కొనుగోలుకు మంత్రి సత్యకుమార్ ఆమోదం**

**అమరావతి, సెప్టెంబర్ 07:** ప్రభుత్వాస్పత్రుల్లో మాతా, శిశు వైద్య సేవలను విస్తరింపజేసి గర్భిణులు, నవజాత శిశువుల మరణాలను తగ్గించే కూటమి ప్రభుత్వ ప్రయత్నాల్లో ఒక పెద్ద అడుగు ముందుకు పడనుంది. గుంటూరు, కాకినాడ సర్వజన ఆస్పత్రు (జిజిహెచ్ )ల్లో రెండు నూతన ఎంసిహెచ్ (మదర్ అండ్ ఛైల్డ్ కేర్) బ్లాకుల ద్వారా సేవలను పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైంది. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ రెండు బ్లాకుల్లో వైద్య సేవలందించడానికి అవసరమయ్యే వైద్య పరికరాలను, ఇతర అవసరమైన వస్తువులను రూ. 51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి వైద్యారోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు :**
గుంటూరు జిజిహెచ్ లో పూర్వ విద్యార్థుల (GMCANA) ఆర్థిక సహకారంతో రూ. 86 కోట్లతో నిర్మించబడుతున్న నూతన ఎంసిహెచ్ బ్లాకు త్వరలో పూర్తి కానున్నది. దీనిలో 500 పడకల ద్వారా మాతా, శిశు వైద్యసేవలన్ని విస్తృతం చేయనున్నారు. ఇదే రీతిన, కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల (RMCANA) సహకారంతో రూ. 46 కోట్లతో నిర్మాణంలో వున్న మరో ఎంసిహెచ్ బ్లాకు కూడా త్వరలో పూర్తి కానున్నది. దీనిలో కూడా మరో 500 పడకలతో సేవలందించేదుకు వీలుంది.

**రూ. 51 కోట్లతో వైద్య పరికరాలు :**
ఈ రెండు ఎంసిహెచ్ బ్లాకు ల ద్వారా సేవలందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, అనుబంధ సామ్రగిని రూ. 51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అనుమతించారు. మొత్తం 332 రకాలకు చెందిన 5,687 పరికరాలు మరియు సామ్రగిని కొనుగోలు చేస్తారు. గుంటూరు జిజిహెచ్ లో 37 రకాలకు చెందిన 1,187 పరికరాలను రు. 23.51 కోట్లతో అందజేస్తారు. కాకినాడ జిజిహెచ్ లో 295 రకాలకు చెందిన 4,500 పరికరాలను రు. 27.82 కోట్లతో ఏర్పాటు చేస్తారు. ఈ కొత్త బ్లాకుల కోసం పడకలు, బెడ్లు, ఐసియు బెడ్లు, పేషెంట్ మోనిటర్లు, వెంటిలేటర్లు, డీఫిబ్రిరేటర్లు, ఇసిజి మెషీన్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, మొబైల్ ఆల్ట్రా సౌండ్ మెషీన్లు, నిబులైజర్లు, డెలివరీ సెట్లు, ఆక్సీ మీటర్లు, ఫోటో థెరపీ యూనిట్లు, సర్జికల్ ఛైర్లు వంటి పలు రకాల వైద్య పరికరాలను భారీ స్థాయిలో కొనుగోలు చేయనున్నారు.

**మంత్రి అభినందనలు :**
ఈ రెండు ఆస్పత్రుల్లో ఎంసిహెచ్ బ్లకుల నిర్మాణానికి ముందుకొచ్చిన గుంటూరు మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా (GMCANA), కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా (RMCANA)లను మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఈ బ్లాకుల నిర్మాణాలకు కృషి చేసిన ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు, సిబ్బందిని మంత్రి ప్రశంసించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** మండల విద్యా వనరుల కేంద్రం చేబ్రోలు : శనివారం చేబ్రోలు ఎం ఆర్ సి దగ్గర గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు . మండల విద్యాశాఖ అధికారులు రఘు చలపతిరావు ఆర్ సుబ్బారావు ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించారు . ఎంఈఓ లు మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రశంసలు అందుకుంటున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి అభినందనలు తెలియజేశారు. మండల పరిధిలో ఓర్పు సహనము ఈ విద్యా సంవత్సరం పాఠశాల ప్రతి సంవత్సరం ప్రైవేటు స్కూల్స్ నుండి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నమోదు శాతాన్ని పెంచడంలో , విద్యార్థుల ప్రగతి పురోగతి సాధించడంలో ముందుండి స్వచ్ఛంద సంస్థల ద్వారా విద్యార్థుల ఉపయోగాలు కంప్యూటర్ పొలిటిక్స్ స్పోకెన్ ఇంగ్లీష్ వెబ్ కెమెరా లాంటి వసతులు ఏర్పాటుచేసిన , విద్యార్థులు మరియు తల్లిదండ్రుల తో మంచి సమన్వయంతో పనిచేస్తూ ముందుకెళుతున్న ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించడం జరిగిందని అన్నారు . ముందుగా అభినందన సభలో ప్రస్తుతం చేబ్రోలు లో పనిచేస్తున్న ఈ సంవత్సరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత 9వ, 2వ, 1వ తరగతుల తెలుగు పాఠ్య పుస్తకాల రచయిత డా . అవ్వారి పద్మావతి యస్. జి. టి, మం. ప. మోడల్ స్కూల్, చీలిపాలెం మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు . అలానే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు శేకూరు జడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు టి విజయలక్ష్మి , కెసి హై స్కూల్ కొత్త రెడ్డిపాలెం నుండి సి హెచ్ చల్లా శివ శంకర రెడ్డి , పి శ్రీనివాసమూర్తి ఎస్జీటీ ఎంపీపీ ఎస్ (ప్రైమరీ) వేజెండ్ల , ఎం వి ఎస్ లక్ష్మి కుమారి ఎస్జిటి ఎంపీపీఎస్ (బి ఎఫ్ ఎస్) వేజెండ్లలు కార్యక్రమంలో మెమెంటోలు దృశ్యాలువాతో సత్కరించి ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందించారు . మండల స్థాయిలో పాఠశాల ఎన్రోల్మెంట్ పెంచడంలోనూ పాఠశాల నిర్వహణ మరియు విద్యార్థుల ప్రగతి సాధించుటలో ముందు వరుసలో ఉన్న సెకండియర్ టీచర్లు జి మాణిక్యరావు వీరనాయకులపాలెం , కె ఏసుబాబు (డి పెప్) సుద్దపల్లి , బి సంధ్యారాణి (హెచ్ ఈ )శల పాడు , జె రవీంద్రబాబు (ఎస్డబ్ల్యు)కొత్తరెడ్డిపాలెం , ఎస్. కె అర్షతున్న (ఉర్దూ)నడింపేట చేబ్రోలు , జెకీరున్నిసా ఉప్పరపాలెం , కె శంకర్ (ఎ బి) నారాకోడూరు , వి సీతారామమ్మ (ఎస్ డబ్ల్యూ) గొడవర్రు , ఎం లీల శ్రీనివాసమూర్తి (ఎ ఎ) గౌడ పాలెం , సి నర్సిరెడ్డి కె సి ఈ ఎస్ కొత్త రెడ్డిపాలెం మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా 10 మందికి శాలువలతో సత్కరించి పూలమాలలు వేసి మెమొంటోలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఏపీటీఎఫ్ ఎస్ టి యు యూనియన్ లీడర్స్ మాట్లాడుతూ సమస్యలు ఎన్ని ఉన్నా పని భారం పెరిగినా ఏ ఉపాధ్యాయుడు ఒత్తిడికి గురికాకుండా పిల్లలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పాఠశాలలను అభివృద్ధి పదంలో నడిపించాలని కోరారు . కార్యక్రమములు సీఆర్పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు .



# ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్






**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** స్థానిక కొత్తపేటలోని శ్రీ పెద్ద మహాలక్ష్మమ్మ గుడి దగ్గర నూతనంగా లక్ష్మీ మెడికల్ హబ్ హోల్ సేల్ జనరిక్ మందుల షాపును తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మాట్లాడుతూ గుంటూరు నగరంలో మెడికల్ కు హోబ్ గా ఉన్న కొత్తపేటలో లక్ష్మీ మెడికల్ హబ్ జనరిక్ హోల్ సేల్ మందుల షాపును ప్రారంభించడం శుభప్రణామన్నారు. ప్రజలు జనరిక్ మందులను కొనుగోలు చేసుకుని డబ్బులను ఆదా చేసుకోవచ్చునని, బ్రాండెడ్ మందులు కొనుగోలు చేయలేక ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. జనరిక్ మందులు ప్రజలకు అందుబాటు ధరలో ఉంటాయని ప్రతి ఒక్కరూ అపోహలు వీడి జనరిక్ మందులను చక్కగా వాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం మనం తీసుకునే ఆహారంలో నాణ్యత లోపించడంతో ఎంతో మంది ప్రజలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, మందుల ధరలు చూస్తే ఆకాశం అంటేలా కొనలేని స్థితిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జనరిక్ మందులు చక్కగా పని చేస్తాయని బ్రాండెడ్ కంపెనీ మందులు ధరలతో పోల్చుకుంటే జనరిక్ మందులు అందుబాటు ధరలో ఉంటాయని తెలిపారు. ఇతర మందులు, జనరిక్ మందులు ఒకే లాగా పని చేస్తాయని ప్రజలందరూ అవగాహన చేసుకుని జనరిక్ మందులను వాడుకుంటే ఆరోగ్యం ఎంతో చక్కగా ఉంటుందని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. అనంతరం లక్ష్మీ మెడికల్ హబ్ హోల్‌సేల్ జనరిక్ మందుల షాపు యజమాని బాలు మాట్లాడుతూ జనరిక్ మందలు బ్రాండెడ్ మెడిసిన్ తో పోలిస్తే నూటికి 80% రాయితీతో తక్కువ ధరలకే అందుబాటులో ఉంటాయని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 6 వ డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, గుంటూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పద సంచాలకులు వి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ కు 'ఎంటెరోమిక్స్' వ్యాక్సిన్

**– క్లినికల్ ట్రయల్స్‌లో 100% ఫలితాలు**




**నరసరావుపేట మేజర్ న్యూస్ :** రష్యా తన ఎంటెరోమిక్స్ అనే క్యాన్సర్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రకటించింది. ఈ వ్యాక్సిన్ క్యాన్సర్ ట్యూమర్లను కరిగించడం ద్వారా నాశనం చేస్తుందని, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తూ క్యాన్సర్ కణాలతో పోరాడుతుందని రష్యా ఫెడరల్ మెడికల్ అండ్ బయోలాజికల్ ఏజెన్సీ (ఎఫ్ ఎం బి ఏ) తెలిపింది. ఈ వ్యాక్సిన్ పెద్దపేగు క్యాన్సర్‌తో పాటు ఊపిరితిత్తులు, రొమ్ము, మెదడు (గ్లియోబ్లాస్టోమా), చర్మ క్యాన్సర్ (మెలనోమా) వంటి వివిధ రకాల క్యాన్సర్‌లకు చెక్ పెట్టే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొంది. రష్యా మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ మెడికల్ రీసెర్చ్ రేడియోలాజికల్ సెంటర్ మరియు ఎంగెల్‌హార్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాలిక్యులర్ బయాలజీ (ఈ ఐ ఎం బి) సంయుక్తంగా ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశాయి. ఎంటెరోమిక్స్ ఎంఆర్ఎన్ఏ (ఎం ఆర్ ఎన్ ఏ) సాంకేతికత ఆధారంగా రూపొందించబడింది, ఇది కోవిడ్–19 వ్యాక్సిన్‌లలో విజయవంతంగా ఉపయోగించిన సాంకేతికతతో సమానమైనది. ఈ వ్యాక్సిన్ నాలుగు హానిరహిత వైరస్‌లను ఉపయోగించి క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకుని నాశనం చేస్తుంది, అదే సమయంలో రోగి యొక్క రోగనిరోధక శక్తిని ఉత్తేజపరుస్తుంది. ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ (ఈ ఈ ఎఫ్)లో ఎఫ్ఎంబీఏ అధిపతి వెరోనికా స్క్వోర్ట్సోవా మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా నిర్వహించిన ప్రీ–క్లినికల్ ట్రయల్స్‌లో ఈ వ్యాక్సిన్ అత్యంత సురక్షితమైనదని, బహుళ డోసులలో కూడా ఎలాంటి తీవ్రమైన దుష్ప్రభావాలు లేకుండా 60–80% సమర్థతను ప్రదర్శించిందని వెల్లడించారు. కొన్ని సందర్భాల్లో ట్యూమర్లు పూర్తిగా నాశనం కాగా, మరికొన్ని సందర్భాల్లో ట్యూమర్ల పెరుగుదల 60–80% తగ్గినట్లు తెలిపారు. 2025 జూన్‌లో సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్ (ఎస్పిఐ ఈ ఎఫ్)లో ఈ వ్యాక్సిన్ యొక్క ఫేజ్–1 క్లినికల్ ట్రయల్స్ ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఈ ట్రయల్స్‌లో 48 మంది స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు, ఇందులో వ్యాక్సిన్ చాలా తక్కువ టాక్సిసిటీని చూపించినట్లు నేషనల్ మెడికల్ రీసెర్చ్ రేడియోలాజికల్ సెంటర్ డైరెక్టర్ జనరల్ ఆండ్రీ కప్రిన్ తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ నుండి తుది అనుమతి కోసం వేచి ఉంది. ఎంటెరోమిక్స్ వ్యక్తిగతీకరించిన చికిత్సా పద్ధతిని అందిస్తుంది, ఇది రోగి యొక్క ఆర్ఎన్ఏ ఆధారంగా రూపొందించబడుతుంది. ఇది సాంప్రదాయ చికిత్సలైన కీమోథెరపీ, రేడియేషన్‌లకు భిన్నంగా, క్యాన్సర్ కణాలను ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకుని నాశనం చేస్తుంది. ఈ వ్యాక్సిన్ మొదట పెద్దపేగు క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించబడనుంది, అలాగే గ్లియోబ్లాస్టోమా మరియు మెలనోమా చికిత్సకు కూడా అభివృద్ధి చేయబడుతోంది. రష్యా ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది, ఇది రోగులకు ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించే లక్ష్యంతో ఉంది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ అనుమతి లభించిన వెంటనే ఈ వ్యాక్సిన్ వాణిజ్యపరంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విజయం క్యాన్సర్ చికిత్సలో కొత్త ఆశలను రేకెత్తిస్తూ, ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ రోగులకు నూతన ఆశాకిరణంగా నిలుస్తుంది.

# సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా భాష్యం ఉద్యోగుల వేధింపులు

**గుంటూరు :** చంద్రమౌళి నగర్‌లోని భాష్యం విశ్వకర్మ జూనియర్ కాలేజీ యాజమాన్యం ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థినికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తోంది. భాష్యం విద్యాసంస్థలో పని చేసే ఉద్యోగి కుమార్ సంబంధిత విద్యార్థి తల్లిదండ్రుల వద్ద కొంత డబ్బులు తీసుకుని ఇంతవరకూ విద్యాసంస్థలకు చెల్లించలేదు. ఆ విద్యార్థి ప్రస్తుతం బిటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇంజనీరింగ్ కాలేజీ వారు సర్టిఫికెట్ల కోసం రోజూ విద్యార్థిని అడుగుతున్నారు. ఈ విషయం భాష్యం కాలేజీ డీన్‌కు, ఉద్యోగికి చెప్పినా తాత్సారం చేస్తున్నారు. దీంతో ఆ విద్యార్థి, తల్లిదండ్రులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. విద్యార్థి సర్టిఫికెట్లు లేనిదే కాలేజీకి వెళ్లనని, దీంతో తన చదువుకు తీవ్ర ఆటంకం కలుగుతోందని బాధపడుతోంది. ఈ విషయం డీన్‌కు, ఉద్యోగికి చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ గారు, సంబంధిత విద్యాశాఖాధికారులు ఈ విషయంపై ఎంక్వయిరీ వేసి వెంటనే సర్టిఫికెట్లు ఇప్పించవలసినదిగా విద్యార్థిని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇలాంటి నీచ ఉద్యోగుల వల్ల కనీసం ఆడపిల్లలు చదువకోలేకపోతున్నారు.

## అమ్మవారి ఆలయ భక్తులను ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు : దుర్గి ఎస్సై





**దుర్గి మేజర్ న్యూస్ :**
పల్నాడు జిల్లా దుర్గి మండలంలోని ఆడిగొప్పల గ్రామ శివారులో ప్రసిద్ధి గల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులను దారిలో ఆపి కొందరు మహిళలు డబ్బులు వసూలు చేస్తున్నారనే సమాచారం అందడంతో, దుర్గి ఎస్సై సుదీర్ కుమార్ ఆ ప్రాంతంలో పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా ఎస్సై సుదీర్ కుమార్ మాట్లాడుతూ పవిత్ర మైన అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను, గ్రామస్థులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చంద్రగ్రహణం ప్రభావంతో అడిగోప్పల అమ్మవారి ఆలయ తలుపులు మూసివేత

**దుర్గి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగోప్పల గ్రామంలోని శ్రీ నిదానం పాటి అమ్మవారి ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి మూసివేశారు. ఆలయ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ తలుపులు తిరిగి తెరిచి, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చంద్రగ్రహణం సమయంలో భక్తుల రద్దీ తక్కువగా ఉండేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ఆలయ మూసివేత, తిరిగి ప్రారంభం గురించి మైక్ ద్వారా భక్తులకు ముందుగానే తెలియజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.




## విద్యార్థులు దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి


**– మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ శివ నాగేశ్వరరావు**

**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :** బాగా చదివే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి స్కాలర్ షిప్పులు అందించడం గొప్ప విషయమని, గత 14 సంవత్సరాలుగా విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్న పెదనందిపాడు ఎడ్యుకేషనల్ చారిటబుల్ సోసైటీ సేవలు చాలా మంచివని, ఈ అవకాశాలను ప్రతి విద్యార్థి వినియోగించుకొని జీవితంలో మంచి స్థానాల్లో స్థిరపడాలని నరసరావుపేట మోటారు వెహికల్ ఇన్ స్పెక్టర్ నంబూరు శివనాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పెదనందిపాడు ఆర్యవైశ్య కల్యాణమండపం లో పెదనందిపాడు ఎడ్యుకేషనల్ చారిటబుల్ సోసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్ షిప్పులు పంపిణీ కార్యక్రమం లో ముఖ్యఅతిధిగా పాల్గొన్న శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదుకోవాలని, చెడు అలవాట్లకు, పనికిరాని సోషల్ మీడియా కు బానిసలు కావద్దని విద్యార్థులకు సూచించారు. మీ పిల్లలను కళాశాల లో చేర్చడమే కాదు. మీరు కూడా కళాశాల కు వెళ్లి వారు చదువుతున్నారా లేదా, వాళ్ళ ఫ్రెండ్స్ ను కలిసి మాట్లాడాలి, వాళ్లతో కలిసి అన్ని విషయాలు పంచుకోవాలని అయన తల్లితండ్రులకు తెలిపారు. తద్వారా మీ పిల్లల గురించి మీరు తెలుసుకోవచ్చని, వారి చదువు మీద ద్రుష్టి పెట్టేలా చర్యలు కూడా తీసుకోవచ్చని అయన వారికి తెలియజేసారు. ఈ సోసైటీ కి తన వంతు సాయంగా పెదనందిపాడు ఎడ్యుకేషనల్ సోసైటీ కి ఒక లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. తదనంతరం విద్యార్థులకు చెక్కు



లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సోసైటీ సభ్యులు ఆరవపల్లి కృష్ణమూర్తి, దాసరి శేషగిరిరావు, గేరా రత్నం, దాసరి చంద్ర శేఖర్, ముద్దన రాఘవయ్య, కాకరపర్తి రమేష్, దాసరి సత్యనారాయణ, కె వి సాయిప్రసాద్, దాసరి ప్రసాద్, డోప్పలపూడి రమేష్, వి విద్యాసాగర్ గుప్తా, మామిడిపాక రామచంద్రరావు, మామిడిపాక శ్రీనివాసరావు, దాసరి రాజా, విద్యార్థులు, తల్లిదండ్రులు, సోసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు మృతి



**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండల మాజీ పార్టీ ఉపాధ్యక్షుడు మాదినేని నాగేశ్వరరావు (67) గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో కుమారుడు ఇంటిలో ఉన్న ఒక్కసారి గుండెపోటుతో కుప్ప కులాడని, సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకు వెళ్లిన ఉపయోగం లేదని, అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారని, హైదరాబాద్ నుండి ప్రత్యేక వాహనంలో స్వగ్రామం కట్రపాడు గ్రామానికి తీసుకువస్తున్నారని, సోమవారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయాని, స్థానిక శాసన సభ్యులు కూడా అంత్యక్రియలకు హాజరువుతారని కుటుంబ సభ్యు లు తెలియజేసారు.


## వైయస్.ఆర్.సిపి మాచవరం మండల అనుబంధ విభాగ కమిటీలలో అధ్యక్షులుగా నియామకం



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు గురజాల నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో మాచవరం మండలంలోని మాచవరం మండలానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాచవరం అనుబంధ విభాగ అధ్యక్షులుగా నియమించారు. వైసీపీ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులుగా చిన్న రామాంజనేయులు, రైతు విభాగం అధ్యక్షులుగా సల్ల గుండ్ల రాంబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గారపాటి సింగరయ్య, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా వంకాయల రమేష్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా జక్కుల కొండను నియమిస్తూ వైసిపి పార్టీ అధిష్టానం ప్రకటించడం జరిగింది.

## ఇబ్రహీంకు దేశం తమ్ముళ్ళు అభినందనలు

**మంగళగిరి,మేజర్ న్యూస్ :**
నగరంలోని పాత బస్టాండ్ సెంటర్ గుడ్ విల్ ముస్లిం సంక్షేమ కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన మహమ్మద్ ఇబ్రహీం ను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవాడ దుర్గారావు ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు దేశం తమ్ముళ్ళు కలిసి అభినందించారు. దేశం నాయకులు ఇబ్రహీం ను శాలువాలతో సత్కరించి బొకేలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఇబ్రహీం సేవలను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ఆయన్ని డైరెక్టర్ పదవితో గౌరవించడం అభినందనీయమన్నారు. పదవికి మరింత వన్నె తెచ్చే విధంగా పనిచేసి, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు కూరపాటి మురళి రాజు, వెలగపాటి విలియం, వాకా మాధవరావు గౌడ్, జొన్నాదుల బాలకృష్ణ, అన్నం నాగబాబు, ఎండీ ఆరిఫ్, పేరం ఏడుకొండలు, షేక్ షకీల్, జొన్నాదుల వెంకట రామాంజనేయులు, చింతా వెంకటేశ్వరరావు, జి రమేష్, వడ్డేశ్వరం రాజారావు తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలి ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం




**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలి పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వర పేటలోని పద్మశాలి రాష్ట్ర కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారికి అభినందన సత్కార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమము పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు జివి రామకృష్ణ, తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల సుబ్బారావు, కోశాధికారి తిరువీధుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన మాచర్ల నాగేశ్వర రావు, ఆకురాతి హరివరప్రసాద్, దివి ఉమాదేవి, మాచర్ల లీలా శ్రీనివాసమూర్తి, ఆరికాటి బాలసుబ్రమణ్యం లకు అభినందన సత్కారం నిర్వహించారు. పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు జి.వి.రామకృష్ణ మాట్లాడుతూ నైపుణ్యముతో విద్యార్థులకు విద్యాబోధన చేయడం, సమర్ధవంతంగా విధులు నిర్వహించి అధికారుల, ఉద్యోగ, ఉపాధ్యాయుల, తల్లి తండ్రుల మన్ననలు పొందడం పద్మశాలి సామాజిక వర్గానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించడం గర్వముగా ఉందన్నారు. కార్యక్రమములో కటకం వెంకటప్రసాద్, ఓంకార్ గ్రాఫిక్స్ అధినేత, తెనాలి శాఖ ఉపాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, కందుల శ్రీనివాస రావు, కౌతరపు శ్రీనివాసరావు, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పిడుగురాళ్ల పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా జడ సురేంద్ర



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా జడ సురేంద్ర ఎన్నికైనట్లు "నేటిదినపత్రిక సూర్య" కు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సంబంధిత అధికార ప్రకటనను వైసీపీ కార్యాలయం నుండి వెలువడినట్లు పేర్కొన్నారు. సురేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద పదవిని అప్పజెప్పిన వైసీపీ అధినేత వైయస్ జగన్మోహనరెడ్డికి, పదవి రావడానికి కృషి చేసిన గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్ గెలుపుకు, గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి గెలవడానికి నిరంతరం పాటు పడతానని జడ సురేంద్ర వెల్లడించారు. పిడుగురాళ్ల పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన సురేంద్రను పలువురు వైసీపీ శ్రేణులతో పాటు పట్టణ ప్రముఖులు, పుర:ప్రముఖులు అభినందించారు.

## పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం..!

**– సీఎం సహాయనిధి పంపిణీలో ఎమ్మెల్యే జూలకంటి**

**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :**
పేదల సంపూర్ణ ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 87 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా రూ. 81 లక్షల, 97 వేలు విలువ చేసే నగదు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిది సంజీవినిల మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విలేకరులకు సన్మానం



**బొల్లాపల్లి మేజర్ న్యూస్ :** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు అయినా కల్వకుంట చంద్రశేఖర్ గుప్తా జయంతి వారోత్సవాల్లో భాగంగా స్థానికంగా ఉన్న పాత్రికేయులు సింహాచలం , చైతన్య , శివ , వాసవి క్లబ్ వైభవం వెల్లటూరు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వైభవం వెల్లటూరు ప్రెసిడెంట్ గజవల్లి వెంకటసుబ్బయ్య , సెక్రటరీ అరవపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కోట శీను , మరియు వాసవి క్లబ్ సభ్యులైన కజ్జాయం లక్ష్మీనారాయణ , మరియు గజవల్లి చిన్న పేరయ్య , కోట వెంకటేశ్వర్లు , ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మరికొన్ని జిల్లాల జర్నలిస్టులకు హెల్త్ కార్డులు

**– లలిత ఆసుపత్రి యాజమాన్యంతో ఐ వి సుబ్బారావు**



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** కొత్తగా మరికొన్ని జిల్లాల జర్నలిస్టులకు రాయితీతో కూడిన హెల్త్ కార్డులు ఇప్పించేందుకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ వి సుబ్బారావు గుంటూరులోని లలిత సూపర్ స్పెషాలిటీ యాజమాన్యంతో ఆదివారం మాట్లాడినారు. జర్నలిస్టులకు వైద్య ఖర్చులలో 50% రాయితీ కల్పించాలని, కుటుంబ సభ్యులకు 30 శాతం కల్పించాలని వైద్య పరీక్షల్లో కూడారాయితి తో కూడిన మెరుగైన వైద్యం అందించాలని ఆయన యాజమాన్యాన్ని కోరగా అందుకు లలిత సూపర్ స్పెషాలిటీ యాజమాన్యం అంగీకరించడం జరిగింది. ఇప్పటికే గుంటూరు జిల్లాలోని జర్నలిస్టులకు కార్డులను పంపిణీ చేశారు. త్వరలో బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల జర్నలిస్టులకు కార్డులు పంపిణీ చేయాలని సుబ్బారావు కోరారు. ఈ నేపధ్యంలో లలిత హాస్పిటల్ యాజమాన్యం అంగీకారం తెలిపింది. ఈ జిల్లా కేంద్రాల్లో హెల్త్ కార్డులు పంపిణీ చేయడం పూర్తయిన తర్వాత, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కూడా జర్నలిస్టులకు వైద్యం అందించేందుకు తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు తెలిపారు. లలిత సూపర్ స్పెషాలిటీ యాజమాన్యంను కలిసిన వారిలో ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఎన్ మీరా, కె. రాంబాబు, బాపట్ల అధ్యక్షులు రాంబాబు, నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె. వెంకయ్య, బి. కార్తీక్, ఉపాధ్యక్షులు భవిరిశెట్టి వెంకటేశ్వరావు, ఆళ్ల వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

# సిపిఎం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన

**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. భారతదేశం ఎగుమతులపై అమెరికా అధ్యక్షులు ట్రంప్ సుంకాలను 50 శాతానికి పెంచడాన్ని నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఆక్వా మరియు టెక్స్టైల్స్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి అన్నారు. రొయ్యలు ధరలు పడిపోవడంతో తీర ప్రాంత రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. వేలాది మంది మహిళా కార్మికులు ఉపాధి ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. దేశ ఉత్పత్తుల్లో 40% ఏపీ నుండి ఉంటాయని 2000 కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులపై ఆ ప్రభావం పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కె జోజి, జి. బాలచంద్రుడు, ఎం. అంజయ్య, కె కోటేశ్వరరావు ,శ్రీనివాసరావు ,కాళేశ్వరరావు ,బి. రాజు, టి . రాఘవులు ,తదితరులు పాల్గొన్నారు.




# మూసివేసిన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంను ఆదివారం చంద్ర గ్రహణం సందర్బముగా ముసివేశారు . మధ్యాహ్నం కవాట. బంధనం చేసి దేవస్థానమును మూసివేసినట్లు ఆలయ అధికారి తెలిపారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం ఉదయం 9 గంటల నుండి శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్ దర్శనం. ప్రారంభమగునని ఆలయ కార్య నిర్వహణ అధికారి తెలిపారు.

# దర్గాను సందర్శించిన స్టేట్ వర్క్ బోర్డ్ కార్యదర్శి మహమ్మద్ అలీ



**పెదకాకాని మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాను ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహమ్మద్ అలీ ఆదివారం గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం పెదకాకానిలోని హాజరత్ సయ్యద్ బాజీ షాహిద్ ఔలియా దర్గాను సందర్శించారు. ముందుగా దర్గాలో సాంప్రదాయ బద్ధకంగా ఫాతేహాలు చదివించి పిమ్మట దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో దర్గా పరిసర ప్రాంతాలను పరిశీలించి దర్గా డెవలప్మెంట్ కోసం తగు సూచనలు మరియు సలహాలను అందజేశారు.

# మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి..!

**– అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ**
**– ఎరువుల బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు**

**మాచర్ల మేజర్ న్యూస్:** గత కొంతకాలంగా ప్రజల నజరుకు దూరంగా ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మళ్లీ పబ్లిక్‌లోకి వచ్చారు. ఈ నెల 9న జరగబోయే అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కోసం ఆయన మాచర్లకు వచ్చారు. పిన్నెల్లి రాకతో వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నేతలు భారీగా తరలివచ్చి ఆయనకు ఘనస్వాగతం పలికారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ, “రైతుల సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ పోరాట లక్ష్యం. ఈ నెల 9వ తేదీన జరగబోయే అన్నదాత పోరు కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరుతున్నాను” అని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత తొలిసారి మాచర్లకు వచ్చిన ఆయన పర్యటన వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. త్వరలోనే మరిన్ని రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొననున్నట్లు ఆయన సమీపవర్గాలు తెలిపాయి.






# ఉచిత యోగ శిక్షణను వినియోగించుకోవాలి



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం నందు ఆదివారం శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో ఉచిత యోగశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ గురువులు కిషోర్ గురూజీ హాజరై ఆసనాలు, ప్రాణాయామము, ధ్యానము, సూర్య నమస్కారాలు, దేవీ నమస్కారాలు. ఆహార నియమ నిబంధనలను తెలిపారు. వివరించారు ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు యోగ శిక్షణ కార్యక్రమం ఉంటుందని గ్రామంలోని మహిళలు వృద్ధులు, చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధి కారి శ్రీనివాస్ వర్మ ,అర్చకులు నాగేశ్వరం యుగంధర్ పాల్గొన్నారు.



# 30 ఏళ్లుగా బస్ సౌకర్యం లేని గ్రామాలకు త్వరలో ఆర్టీసీ బస్..?

**నూజెండ్ల మేజర్ న్యూస్:**

గత 30 ఏళ్లుగా బస్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న దాట్లవారిపాలెం, హరిజన కాలనీ, కమ్మవారిపాలెం గ్రామ ప్రజలకు శుభవార్త అనే చెప్పాలి. హైస్కూల్‌కి వెళ్ళే విద్యార్థులు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామానికి సుమారు 5గ్రామాలు(త్రిపురపురం, గొల్లపాలెం,తలార్లపల్లి, దాట్లవారిపాలెం, కమ్మవారిపాలెం) కు చెందిన పిల్లలు ప్రమాదకరంగా ఆటోల్లో వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఈ రూట్లో నూజెండ్ల లో వెళ్లే బస్సు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆళ్ల గురువారెడ్డి , గ్రామస్తులు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కలిసి బస్సు కోసం వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ వారికి బస్సు ఏర్పాటుకు కావలసిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు అందులో భాగంగా ఆర్టీసీ అధికారులు ఆదివారం మండలంలోని ఐదు గ్రామాలను రూట్ సర్వే నిర్వహించారు. బస్సు ఏర్పాటు వలన వందల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు గ్రామ ప్రజలకు వినుకొండకు, నూజెండ్ల వెళ్లే దానికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని ప్రజల ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే సాధ్యమైనంత తొందరగా తమ ఊరికి బస్సు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. వినుకొండ ఆర్టీసీ సూపర్డెంటి ధనలక్ష్మి మాట్లాడుతూ రూటు వెరిఫికేషన్ లో భాగంగా ఆదివారం బస్సు తో వెరిఫికేషన్ చేసామని,, గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించి, ప్రయాణికుల సంఖ్య, రహదారి పరిస్థితులను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా రిపోర్టు రాసి పంపించి బస్సు ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలియజేశారు. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ పిల్లలకు స్కూలుకు వెళ్ళొచ్చేందుకు రాకపోకలు సులభం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. “30 ఏళ్ల తర్వాత గ్రామానికి మళ్లీ తిరిగి బస్సు నడుస్తుందంటే సంతోషంగా ఉందని” స్థానికులు ఎమ్మెల్యే ఆంజనేయులు కృషికి కృతజ్ఞతలు తెలిపారు.



డియస్సీ
గ్రూప్-1, గ్రూప్-2
జె.ఎల్.,

# జాగ్రఫీ



1. భారతదేశంలో అత్యధిక పరీవాహక ఉన్న నది ఏది?
   ఎ. గంగా బి. బ్రహ్మపుత్ర
   సి. గోదావరి డి. సింధు
2. గంగానది బంగ్లాదేశ్‌లో బ్రహ్మపుత్ర నదిని కలుపుకున్న తరువాత ఏ పేరుతో పిలువబడుతుంది?
   ఎ. జమునా బి. పద్మ
   సి. మేఘన డి. గంగానది
3. గోదావరి నది సముద్రంలో కలిసే ముందు ఎన్ని పాయలుగా చీలుతుంది?
   ఎ. 2 బి. 3 సి. 4 డి. 7
4. ఇందులో ఏది సింధూ నది యొక్క ఉపనది?
   ఎ. యమున బి. గోదావరి
   సి. బియాస్ డి. కోసి
5. గంగోత్రి సమీపంలో పుట్టుచున్న నది
   ఎ. అలక్ నంద బి. భగీరథ
   సి. కావేరి డి. మహీనది
6. ద్వీపకల్ప నదులలో పెద్దది?
   ఎ. కృష్ణా బి. కావేరి
   సి. గోదావరి డి. మహానది
7. వరదలకు పేర్గాంచిన నది?
   ఎ. కావేరి బి. కృష్ణా
   సి. గోదావరి డి. బ్రహ్మపుత్ర
8. కృష్ణా నది యొక్క జన్మస్థానము
   ఎ. నాసిక్ బి. మహాబలేశ్వర్
   సి. అమర్ కంటక్ డి. ముల్టాయి
9. పగులు లోయ గుండా ప్రవహిస్తున్నటువంటి నది
   ఎ.సింధూ బి. గంగా
   సి. బ్రహ్మపుత్ర డి. నర్మదా
10. హీరాకుడ్ ప్రాజెక్టు ఏ నదిపైన కలదు?
   ఎ. శరావతి బి. మహానది
   సి. ఇంద్రావతి డి. కావేరి
11. భారతదేశంలో పొడవైన ప్రాజెక్టు ఏ నదిపైన కలదు?
   ఎ. సట్లెజ్ బి. కృష్ణా
   సి. మహానది డి. దామోదర్
12. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్ ప్రదేశ్‌లో ఏమని పిలుస్తున్నారు?
   ఎ. సాంగ్ పో బి. జమున
   సి. మేఘనా డి. దిహాంగ్
13. క్రిందివానిలో అంతర్జాతీయ నది కానిది?
   ఎ. సింధూ బి. గంగా
   సి. బ్రహ్మపుత్ర డి. గోదావరి
14. తూర్పుగా ప్రవహించే నది కానిదేది?
   ఎ.గోదావరి బి. కావేరి
   సి. తపతి డి. కృష్ణా
15. భగీరథ,అలక్ నంద నదులు ఎక్కడ కలుస్తున్నాయి?
   ఎ. రుద్రప్రయాగ బి. క్షేత్రప్రయాగ
   సి. విష్ణుప్రయాగ డి. దేవప్రయాగ
16. గంగానది పశ్చిమబెంగాల్ లో ఏమని పిలుస్తారు?
   ఎ. గంగానది బి. హుగ్లీనది
   సి. పద్మానది డి. హౌరా నది
17. భారతదేశంలో పొడవైన కాలువ ఈ నది కి అనుసంధానంగా ఉన్నది.
   ఎ. సింధూ-గంగా బి. రావి-బియాస్
   సి. బియాస్-సట్లెజ్ డి. గంగా-బ్రహ్మపుత్ర
18. కావేరి నది ఈ రాష్ట్రంలో జన్మిస్తుంది.
   ఎ. తమిళనాడు బి. కర్ణాటక
   సి. మధ్యప్రదేశ్ డి. ఉత్తరప్రదేశ్
19. గంగా-యమున-సరస్వతి నదుల కలయికను ఇలా అంటారు.
   ఎ. సాగరసంగమం బి. త్రివేణి ప్రయాగ
   సి. త్రివేణి సంగమం డి. పైవేవీ కావు
20. క్రింది వానిలో త్రివేణి సంగమం ఎక్కడ ఏర్పడుతుంది?
   ఎ. అంతర్వేది బి. భాసర
   సి. కాళేశ్వరం డి. తంగడి
21. నదులను అధ్యయనం చేయు శాస్త్రం
   ఎ. మొటియోరలజి బి. సిస్మోలజి
   సి. పోటామాలజి డి. క్లైమాటాలజి
22. భీమ నది దేనికి ఉపనది?
   ఎ. కృష్ణా బి. గోదావరి
   సి. నర్మదా డి. కావేరి
23. కావేరి నది జల వివాదంలో ఉన్న ముఖ్య రాష్ట్రాలు
   ఎ. మహారాష్ట్ర-కర్ణాటక బి. తమిళనాడు-కర్ణాటక
   సి. ఆంధ్రప్రదేశ్-కర్ణాటక డి. కేరళ-కర్ణాటక
24. గోదావరి నదికి మరో పేరు
   ఎ. దక్షిణగంగా బి. వృద్ధగంగా
   సి. తెలివాహన డి. పైవన్నియు
25. కుంచికల్ జలపాతం ఏ నదిపైన ఉన్నది?
   ఎ. నర్మదా బి. శరావతి
   సి. వరాహి డి. కావేరి
26. అష్టముడి-వెంబనాడ్ సరస్సులు ఉన్న రాష్ట్రం
   ఎ. తమిళనాడు బి. కేరళ
   సి. కర్ణాటక డి. గోవా
27. క్రింది వానిలో గిరి కర్ణిక అని ఏ నదిని పిలుస్తారు?
   ఎ. మాహి బి. నర్మదా
   సి. తపతి డి. సబర్మతి
28. దక్షిణ భారతదేశంలో రెండవ పొడవైన నది
   ఎ. కృష్ణా బి. గోదావరి
   సి. మహానది డి. కావేరి
29. రైన్ ఆఫ్ ఇండియా అని ఏ నదిని పిలుస్తారు?
   ఎ.కృష్ణా బి. గోదావరి
   సి. కావేరి డి. మహానది
30. బ్రహ్మపుత్ర నది భారతదేశంలో ఏఏ రాష్ట్రాల గుండా ప్రవహిస్తుంది?
   ఎ. అస్సాం-మణిపూర్
   బి. సిక్కిం-అరుణాచల్ ప్రదేశ్
   సి. అస్సాం-అరుణాచల్ ప్రదేశ్
   డి. మేఘాలయ - నాగాలాండ్




## భారతదేశం - నదులు

31. క్రింది వాటిలో సరైన వరుస ఏది?
   ఎ. బియాస్, రావి, జీలం, చీనాబ్, సట్లెజ్
   బి. రావి, బియాస్, సట్లెజ్, జీలం, బినాజ్
   సి. సట్లెజ్, జీలం, బియాస్, రావి, బినాజ్
   డి. జీలం, చినాబ్, రావి, బియాస్, సట్లెజ్
32. 'యు' ఆకారంలో ప్రవహించు నది ఏది?
   ఎ. సట్లెజ్ బి. ఇంద్రావతి
   సి. యమున డి. సబర్మతి
33. శివ సముద్రం జలపాతం ఏ నదిపై ఉన్నది?
   ఎ. కావేరి బి. శరావతి
   సి. వారాహి డి. కడెం
34. జువారి, మండావి నదులు ఏ రాష్ట్రంలో ప్రవహిస్తున్నాయి.
   ఎ. కర్ణాటక బి. కేరళ
   సి. మహారాష్ట్ర డి. గోవా
35. వింధ్య-సాత్పూరా పర్వతాలు మధ్య గుండా ప్రవహించే నది?
   ఎ. గోదావరి బి. సబర్మతి
   సి. నర్మదా డి. మహి
36. ఈ క్రింది వానిలో అంతర్జాతీయ ఉపనది?
   ఎ. సట్లెజ్ బి. రావి
   సి. బియాజ్ డి. జీలం
37. నర్మదా యొక్క కవలగా ఏ నదిని పిలుస్తున్నారు?
   ఎ. తపతి బి. సబర్మతి
   సి. చంబల్ డి. మహి
38. టీ కప్పు మైదానం ఏ నది వల్ల ఏర్పడుతుంది?
   ఎ. మహి బి. మహా
   సి. గోదావరి డి. కావేరి
39. ఏ నదిని శిల్పుల నది అని పిలుస్తున్నారు?
   ఎ. గోదావరి బి. కావేరి
   సి. నర్మదా డి. కృష్ణా
40. నర్మదా నదిపై ఉన్న జలపాతాలు
   ఎ. కపిలదార బి. దువనదార
   సి. సహస్రదార డి. పైవన్నియు
41. క్రింది వానిలో సరైనది కానిది ఏది?
   ఎ.పెన్నా-ఇంద్రావతి బి. కావేరి-హేమవతి
   సి. కృష్ణా-కోయానా డి. యమునా-ఆగ్రా
42. క్రిందివాటిని జతపరచండి
   1. కావేరి ఎ. నంది దుర్గ కొండలు
   2. తుంగభద్ర బి. అగస్త్య మలై కొండలు
   3. పెన్నా సి. వరాహ గిరి కొండలు
   4. తామ్రాపాని డి. బ్రహ్మగిరి కొండలు
   ఎ. 1-ఎ,2-బి,3-సి,4-డి
   బి. 1-డి,2-సి,3-ఎ,4-బి
   సి. 1-బి,2-సి,3-డి,4-ఎ
   డి. 1-సి,2-డి,3-ఎ,4-బి
43. గోదావరి నదిపై తొలి డ్యాం ఏది?
   ఎ. నాగార్జున సాగర్ బి. బాబ్లి
   సి. జయక్ వాడ/గంగాపూర్ డి. పైవేవీ కావు
44. భారతదేశంలో పొడవైన కాలువ
   ఎ. భైరవాని తిప్ప బి. తిప్పాయి ముఖ
   సి. శారద డి. ఇందిరా
45. తాపి మేస్త్రీలు నిర్మించిన ప్రాజెక్టు ఏది?
   ఎ. బాక్రా నంగల్ బి. నాగార్జునసాగర్
   సి. హీరాకుడ్ డి. తెహ్రీ
46. క్రింది వాటిని జతపరుచుము
   1. రుద్ర మాత కాలువ ఎ. ఉత్తరప్రదేశ్
   2. భైరవాని తిప్ప కాలువ బి. గుజరాత్
   3. శారద కాలువ సి. రాజస్థాన్
   4. ఇందిరా కాలువ డి. ఆంధ్రప్రదేశ్
   ఎ. 1-సి,2-ఎ,3-బి,4-డి
   బి. 1-డి,2-సి,3-బి,4-ఎ
   సి. 1-ఎ,2-బి,3-సి,4-డి
   డి. 1-బి,2-డి,3-ఎ,4-సి
47. సరస్వతి నదిని ప్రస్తుతం ఏమని పిలుస్తున్నారు?
   ఎ. గిరికర్ణిక బి. సబర్మతి
   సి. ఘగ్గర్ డి. చంబల్
48. కేరళ-తమిళనాడులకు వివాదాస్పదమైన ప్రాజెక్టు
   ఎ. ముళ్ళపెరియార్ బి. ఆల్మట్టి
   సి. బాబ్లి డి. కావేరి నది జలాలు
49. బైసన్ గార్జ్ ద్వారా ప్రవహించే నది?
   ఎ. బ్రహ్మపుత్ర బి. గోదావరి
   సి. కృష్ణా డి. కావేరి
50. ఏ నదిని రాయలసీమ జీవకళ గా పిలుస్తున్నారు?
   ఎ. పెన్నా బి. కావేరి
   సి. కృష్ణా డి. తుంగభద్ర

**జవాబులు :**

1)ఎ, 2)సి, 3)డి, 4)సి, 5)బి, 6)సి, 7)డి, 8)బి, 9)డి, 10)బి, 11)సి, 12)డి, 13)డి, 14)సి, 15)డి, 16)సి, 17)సి, 18)బి, 19)సి, 20)సి, 21)సి, 22)ఎ, 23)బి, 24)డి, 25)సి, 26)బి, 27)డి, 28)ఎ, 29)బి, 30)సి, 31)డి, 32)సి, 33)ఎ, 34)డి, 35)సి, 36)ఎ, 37)ఎ, 38)బి, 39)డి, 40)డి, 41)ఎ, 42)బి, 43)సి, 44)డి, 45)బి, 46)డి, 47)సి, 48)ఎ, 49)బి, 50)ఎ

పాదం సుధాకర్
ఫ్యాకల్టీ



## రచనలకు ఆహ్వానం

పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఆర్‌ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్‌ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్‌ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.

# ఘనంగా రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వినుకొండ మేజర్ న్యూస్ :**

రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురుగా ఉన్న ఆర్యవైశ్య సంఘం కార్యాలయం నందు రాష్ట్ర కమిటీ కన్వీనర్ కలం కౌంటర్ రవి , కన్వీనర్ల పిలుపుమేరకు ఘనంగా ఆవిర్భావ సంబరాలు వినుకొండ కాకతీయ ఇంచార్జ్ అన్న మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జి, ప్రధాన కార్యదర్శి రెడ్డి నగేష్ బాబు, గౌరవ అధ్యక్షులు తాతా సత్యనారాయణ, కోశాధికారి పెండాల సురేష్ బాబు, వాసవి క్లబ్ సభ్యులు గజవల్లి పవన్ , మండవ కిరణ్ , చిలంకూరి కోటేశ్వరరావు విలేకరులు యస్. నరసింహారావు, దేసు విద్యా సాగర్, దేవరశెట్టి శ్రీనివాసరావు, రెడ్డి నగేష్, దేవి శెట్టి శివ బాల కోటేశ్వరరావు, సన్నిధి వెంకట శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు.
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత
శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని
ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా
మీ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేయాలని
ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేస్తున్నాం.

టి.బాలు
బ్రాంచ్ మేనేజర్,
సెల్: 9440747307

ఎన్.లక్ష్మీనారాయణ
రీజనల్ మేనేజర్
సెల్: 6301107116

విలేఖరులు కావలెను..


వినుకొండ : శావల్యాపురం, నూజెండ్ల
నరసరావుపేట : రొంపిచర్ల, నరసరావుపేట రూరల్
పెదకూరపాడు : బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి
సత్తెనపల్లి : నకరికల్లు
తెనాలి : తెనాలి రూరల్, కొల్లిపర
ప్రత్తిపాడు : పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు
మంగళగిరి : తాడేపల్లి, మంగళగిరి

# పోటీకి టాటా..

- విద్యుత్ పరికరాల సరఫరాలో ఇంకా పాత పద్ధతే
- జగన్ హయాంలో అర్థంలేని 'అర్హత' నిబంధనలు
- 100 శాతం సొంతంగా తయారు చేయాలనే షరతు
- స్థానిక కంపెనీలతోపాటు, జాతీయ సంస్థలకూ శరాఘాతం
- సొంత రాష్ట్రంలో టెండర్లకు మాత్రం అనర్హులు
- పోటీలేకపోవడంతో అధిక ధరలు.. జనంపైనే అంతిమ భారం
- అనేక రాష్ట్రాలకు ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేస్తున్న కంపెనీలు

**నేటి దినపత్రిక సూర్య, పల్నాడు/గుంటూరు ప్రతినిధి :**

కాంట్రాక్టు ఏదైనా పదిమంది పోటీ పడితేనే ధరలు తగ్గుతాయి. అర్థంలేని నిబంధనలు పెట్టి.. షరతుల చట్రం బిగిస్తూ పోతే చివరికి ఒకటిరెండు కంపెనీలకు మాత్రమే అర్హత లభిస్తుంది. విద్యుత్ పరికరాల సరఫరాలో ఇప్పుడు ఇదే జరుగుతోంది. పోటీతత్వానికి చోటు లేకుండా... గత ప్రభుత్వం అమలు చేసిన 'నిబంధన రాజ్యమే' ఇప్పటికీ నడుస్తోంది. దీంతో... ట్రాన్స్‌ఫార్మర్లు, కెపాసిటర్ల వంటి విద్యుత్ పరికరాల కొనుగోలు భారం పెరిగిపోతోంది. ఇదంతా చివరికి... ట్రూ అప్ చార్జీల రూపంలో వినియోగదారులపైనే పడుతోంది. విద్యుత్తు పరికరాల సరఫరా టెండరు ఖరారుకు జగన్ ప్రభుత్వం మార్పులు వేసే విధానాన్ని తెచ్చింది. ప్రభుత్వ విద్యుత్తు సంస్థలకు పరికరాలను మూడేళ్ల పాటు సరఫరా చేసిన అనుభవం ఉండాలని స్పష్టం చేసింది. అన్నింటికంటే దారుణమైన షరతు మరొకటి విధించింది. అది... ఆ సంస్థలు విద్యుత్ పరికరాలను వందశాతం తామే తయారు చేసి ఉండాలి. ఒక్కటంటే ఒక్క విడి పరికరమూ బయటి నుంచి కొనుగోలు చేయరాదు. ఈ షరతుతో అర్హుల జాబితా అమాంతం పడిపోయింది. పలుజాతీయ సంస్థలే కాదు... రాష్ట్రంలో ఉన్న విద్యుత్ పరికరాల తయారీ సంస్థలకూ టెండర్లలో పాల్గొనే వీలులేని పరిస్థితి. రాష్ట్రంలో కెపాసిటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే సంస్థలు ఐదారు ఉన్నాయి. తెలంగాణతోపాటు యూపీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో టెండర్లలో పాల్గొంటూ... విద్యుత్ పరికరాలను సరఫరా చేస్తున్నాయి. కానీ... జగన్ సర్కారు పెట్టిన అర్థంలేని 'అర్హత' నిబంధనల కారణంగా సొంత రాష్ట్రంలో టెండర్లలో పాల్గొనే అవకాశం లేకుండా పోతోంది. జాతీయ స్థాయిలో పేరుపొందిన తయారీదారులు కూడా ఏపీలో అడుగు పెట్టలేకపోతున్నాయి. కూటమి ప్రభుత్వమైనా ఈ పద్ధతి మార్చాలని చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రతినిధులు కోరుతున్నారు.



**డిపాజిట్ 'గల్లంతు' :**

టెండర్ దక్కించుకున్న సంస్థ చెల్లించాల్సిన బ్యాంకు గ్యారెంటీ విధానంలోనూ జగన్ సర్కారు చేసిన మార్పులపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పరికరాలను సరఫరా చేసే సంస్థలు ఐదేళ్లపాటు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఐదేళ్లలో పరికరాలు పనిచేయకపోతే వాటి స్థానంలో కొత్తవి బిగించాలి. అలా చేయకపోతే... విద్యుత్తు సంస్థలపై భారం పడుతుంది. ఇలా జరగకుండా ఉండేందుకు... సరఫరాదారుపై బాధ్యత పెంచేందుకు వారి నుంచి పది శాతం బ్యాంకు గ్యారెంటీలను వసూలు చేస్తారు. అంటే.. వంద కోట్ల రూపాయల పరికరాలు సరఫరా చేస్తే, పదికోట్లు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలి. ఐదేళ్ల గ్యారెంటీ కాలం గడిచిన తర్వాత మాత్రమే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు. ఇంత పెద్దమొత్తంలో బ్యాంకు గ్యారెంటీగా ఇచ్చినప్పుడు పరికరాల నాణ్యతపై సరఫరాదారు తప్పనిసరిగా దృష్టి సారిస్తారు. కానీ... జగన్ జమానాలో జరిగిన కొనుగోళ్లకు దీనిని పట్టించుకోలేదు. విద్యుత్తు పరికరాల సరఫరాదారులు ఎన్ని వేల కోట్ల రూపాయల విలువజేసే పరికరాలు సరఫరా చేసినా.. కేవలం రూ. 20 కోట్లు బ్యాంకు గ్యారెంటీగా ఇస్తే సరిపోతుందంటూ నాటి ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. 'వేలకోట్లు వచ్చేశాయి. 20 కోట్లు పోతే పోయాయి' అని సరఫరాదారు తెగిస్తే చేసేదేమీ ఉండదు. ఈ నేపథ్యంలో... బ్యాంకు గ్యారెంటీ విషయంలోనూ కూటమి ప్రభుత్వం నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన అవసరముందని విద్యుత్ రంగ నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ప్రొఫెసర్స్ యూనియన్ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**గుంటూరు, విద్య మేజర్ న్యూస్ :** ప్రవేటు టీచర్స్ లెక్చరర్స్ ప్రొఫెసర్ యూనియన్ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.బాబ్జి అధ్యక్షతన ఆదివారం జెకెసి కళాశాల రోడ్డులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కన్వెన్షన్ హాల్లో హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ సౌజన్యంతో జరిగిన యూనియన్ సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అప్స డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షులు జి. మోహన్రావు విచ్చేసి యూనియన్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ వై.ప్రతాపరెడ్డి, జనరల్ సెక్రెటరీగా పి.ఆంజనేయులు, కన్వీనర్ గా పి.వేణుగోపాల్, కోశాధికారిగా వి. సుజాత, ఉపాధ్యక్షులుగా బి.రాధాకృష్ణ ,డి .ధోని, షైక్.మీరా వలి, పి. రాజులు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రెటరీగా పి. వీరభూషణం కోటిరెడ్డి, సుధాకర్, సిహెచ్. ఆనందరావు, సుబ్బారావు, రాధాకృష్ణలు ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర యూనియన్ కన్వీనర్ ఎం. సునీల్ కుమార్ సెంట్రల్ జోన్ జనరల్ సెక్రెటరీ పి. శివయ్య,



రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. నరహరి, లక్ష్మణ్, డి శరత్ కుమార్, జాయింట్ సెక్రెటరీ కే ఆంజనేయులు తదితరులు హాజరయ్యారు. సమావేశానికి గౌరవ అతిథులుగా అప్స డెమొక్రటిక్ రాష్ట్ర కోశాధికారి ఎస్. శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ కె జయ కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ పఠాన్ ముష్రత్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ శివాని, హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసరెడ్డి, మాట్రిక్స్ ఐఐటి అకాడమీ డైరెక్టర్ బి రామిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి టీచర్ కు పిఎఫ్ ,ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని హెల్త్ కార్డులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నూతనంగా ఎన్నికైన గుంటూరు జిల్లా కమిటీని ప్రత్యేకంగా రాష్ట్ర కమిటీ కార్యవర్గం అభినందించింది. హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ రెడ్డిని సమావేశంలో రాష్ట్ర యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు.

# పిడుగురాళ్ల పట్టణ మున్సిపాలిటీ బూత్ వింగ్ గా ఇల్లూరి వెంకయ్య

**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**

పిడుగురాళ్ల పట్టణ మున్సిపాలిటీ బూత్ వింగ్ గా ఇల్లూరి వెంకయ్య ఎన్నికైనట్లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సంబంధిత అధికార ప్రకట నను వైసీపీ కార్యాలయం నుండి వెలువడినట్లు పేర్కొన్నారు.



వెంకయ్య మాట్లాడు తూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద పదవి ని అప్పజెప్పిన వైసీపీ అధినేత వైయస్ జగన్మోహనరెడ్డికి, పదవి రావడానికి సహకరించిన గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో ఏపీలో జగన్ గెలుపుకు, గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్ రెడ్డి గెలుపుకు నిరంతరం కృషి చేస్తానని ఇల్లూరి వెంకయ్య చెప్పుకొచ్చారు. మున్సిపాలిటీ బూత్ వింగ్ గా నియమితులైన వెంకయ్య ను పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు పట్టణ ప్రముఖులు, పుర: ప్రముఖులు అభినందించారు.

# వివాహ కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** మండలం భట్లూరు గ్రామంలో మేకల కళ్యాణ్ గారి వివాహ కార్యక్రమంలో వైయస్సార్సీపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర బూత్ కమిటీ జనరల్ సెక్రెటరీ మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రెటరీ చిలకా జయపాల్, జడ్పిటిసి సంకటి నాగేశ్వరమ్మ సాంసంన్ గారు, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి , ఎంపీటీసీ తేలుకుట్ల సైదారావు , బట్లూరి చిన్న కోటేశ్వరరావు, బాబురావు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.